క్లుప్తంగా

వేగం కంటే ప్రాణం ముఖ్యం


విజయపురం: వాహనం తనిఖీ చేస్తున్న ఎస్ఐ జయప్ప

విజయపురం: వేగం కంటే ప్రాణం ముఖ్యమని ఎస్ఐ జయప్ప అన్నారు. ఆదివారం పన్నూరు సబ్‌స్టేషన్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కారు, ఆటో, స్కూటర్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. సీటు బెల్ట్, హెల్మెట్ లేకుండా వాహనం నడపకూడదని సూచించారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదన్నారు. అతి వేగం కారణంగా తరచూ రోడ్డు ప్రమాదం జరుగుతున్నాయని గుర్తు చేశారు. రోడ్డు నిబంధనను పాటించడంతోపాటు వాహనానికి సంబంధించిన రికార్డు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. అలాగే మద్యం సేవించి, లైసెన్స్ లేకుండా, మైనర్లకు బండి ఇచ్చిన కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

దేశమ్మ ఆలయానికి తాత్కాలిక కమిటీ


తాత్కాలిక కమిటీ సభ్యులు

నగరి: నేత్ర ప్రదాయిని దేశమ్మ దేవాలయానికి తాత్కాలిక కమిటీని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈఓ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు బాధ్యతలను స్వీకరించారు. నూతన కమిటీ సభ్యులు మురళి, వీకేఎస్ వాసు, మదన్‌కుమార్, వెంకటాచలం, సుబ్బరాయుడులను పలువురు దుశ్శాలువాలతో సత్కరించారు. ఆడినెల ఉత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఆలయ ఈఓ సభ్యులను కోరారు. స్థానిక నాయకులు కృష్ణారెడ్డి, జ్యోతినాయుడు, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడి మృతి

విజయపురం: మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ప్రభాకర్‌రాజు(65) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌తో పాటు, మండల నాయకులు, కార్యకర్తలు పలువురు ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని జైన సంఘ మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎస్వీ అరవింద్ ఐ ఆస్పత్రి సహకారంతో చేపట్టిన ఈ శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. 179 మందికి కంటి పరీక్షలు చేయగా 98 మంది ఆపరేషన్‌కు ఎంపికయ్యారు. వారికి అన్ని వసతులను ఉచితంగా కల్పిస్తామని నిర్వాహకులు సుభాష్‌జైన్ తెలిపారు. కార్యక్రమంలో ప్రేమ్‌చంద్ జైన్, విశాల్, సాగర్, ప్రవీణ్, లలిత్, రేవంత్, కమలేష్ తదితరులున్నారు.

ఈఆర్ కార్యాలయం పరిశీలన


కార్యాలయం పరిశీలిస్తున్న ఎస్ఈ సురేంద్రనాయుడు

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో ఈఆర్ఓ (ఎలక్ట్రిసిటీ రెవెన్యూ ఆఫీసు)ను ఎస్ఈ సురేంద్రనాయుడు ఆదివారం పరిశీలించారు. శిథిలావస్థకు చేరుకున్న కార్యాలయ గదులను గమనించారు. పెచ్చులూడిన పైకప్పు, వేలాడుతున్న విద్యుత్ తీగలను చూశారు. ఈఈ మునిచంద్ర మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని మూడు నియోజకవర్గాల నుంచి వినియోగదారులు కరెంటు బిల్లులు కట్టాలంటే ఈఆర్ కార్యాలయానికి వస్తారని తెలిపారు. నూతన భవనం మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఎస్ఈ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో డీఈలు పద్మనాభపిళ్లై, జ్ఞానేశ్వర్, ఈఆర్ఓ ఎస్ఏ గౌతమి పాల్గొన్నారు.

శాకంబరీదేవి అలంకరణలో అమ్మవార్లు

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువుకట్ట సమీపంలో ఉన్న శ్రీశక్తిపీఠంలో కొలువైన శ్వేతవారాహీదేవి, మరకత శక్తి కాళీదేవి ఆదివారం భక్తులకు శాకంబరి దేవి అలంకరణలో దర్శమిచ్చారు. శ్రీశక్తిపీఠ వ్యవస్థాపకుడు శ్రీసిద్ధేశ్వరానంద భారతీస్వామి, మాతాజీ రమ్యానంద భారతీ ఈ మేరకు అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి సుగంధ భరిత పరిమళ ద్రవ్యాలతో అభిషేకాలు చేసి పట్టువస్త్రాలు, పలు రకాల పుష్పాలు, కూరగాయలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.పూజలో పాల్గొన్న భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందించారు.

అతి వాడకం.. అనర్థదాయకం


పొలంలో వేసిన పచ్చిరొట్ట పంటలు



- మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు
- పచ్చిరొట్ట ఎరువులే శ్రేయస్కరం
- ఏఓ రజనికుమారి

పంటకు ఘన, ద్రవ ఎరువులు, పచ్చిరొట్ట, పచ్చి ఆకు ఎరువులు, జీవన ఎరువులు ముఖ్య పోషకాలు, పంట ఎదుగుదలకు సుమారు 16 రకాల పోషకాలు అవసరం. వీటిలో నత్రజని, భాస్వరం, పోటాషియం, ఎక్కువ మోతాదులో అవసరమవుతాయి. ఉప పోషకాలైన కాల్షియం, మెగ్నీషియం, గంధకం తక్కువ మోతాదులో అవసరం. ఇనుము, మాంగనీస్, రాగి, జింకు, బోరాన్, క్లోరిన్, అల్యూమినియం, నికెల్, మొదలైన సూక్ష్మపోషకాలు కూడా పంటకు తక్కువ మోతాదులోనే అవసరమవుతాయి. కానీ రైతులకు అవగాహన లేక మోతాదుకు మించి ఎరువులు వేస్తుంటారని, దీని వల్ల ఫలితం ఏ మాత్రం ఉండకపోవడంతో పాటు అదనపు ఖర్చు అవుతుందని ఏఓ రజనికుమారి తెలిపారు. ఏ ఎరువు ఎందుకు ఉపయోగ పడుతుందోనని వివరాలను ఆమె వివరించారు. – విజయపురం

పొటాషియం

మొక్కల్లో జరిగే జీవ రసాయన క్రియలు, ఎంజైమ్‌ల తయారీకి పొటాషియం అవసరం. మొక్కకు రోగనిరోధక శక్తిని ఇస్తుంది. పురుగు తెగులు ఆశించకుండా కాపాడుతుంది. వాతావరణ ప్రభావాల నుంచి పంటను రక్షించడమే కాకుండా కాయలు, గింజలు పండ్ల నాణ్యత పెరుగుతుంది.

భాస్వరం

భాస్వరంతో వేర్ల పెరుగుదలకు, గింజ కట్టేందుకు ఉపయోగ పడుతుంది. మొక్క పెరుగుదలకు కొమ్మలు తొడగడానికి కూడా అవసరం. నేలలోని సేంద్రియ పదార్థం చివికేలా చేస్తుంది. ప్రొటీన్, ఎంజైమ్‌ల తయారీకి ఉపయోగపడుతుంది. పుష్పజాతి పంటలకు ఎక్కువ భాస్వరం అవసరం.

మెగ్నీషియం

మెగ్నీషియంతో ఎంజైమ్‌ల చురుకుదనం కలిగిస్తుంది. నేలలో నుంచి భాస్వరం గ్రహించడంలో తోడ్పడుతుంది.

పచ్చిరొట్ట ఎరువులు

పంటకు అవసరమయ్యే పోషకాలు సేంద్రియ రూపంలో సమర్థవంతంగా అందించాలంటే పచ్చిరొట్టను బాగా అందించాలి. ఈ పంటలను అదేపొలంలో ముందుగా వేసుకోవాలి. తక్కువ వనరులతో బాగా పెరిగేలా ఈ పంటలను సుమారు రెండు నెలల ముందే పొలంలో విత్తుకోవాలి. ఆ పంట పూతకు వచ్చే సమయంలో భూమిలో కలియదున్నాలి. దున్నిన రెండు మూడు వారాలకు బాగా కుళ్లడంతో విడుదలైన పోషకాలు పొలంలో విత్తిన పంటకు అందుతాయి. ఉదాహరణకు మినుము, అలసంద, జీలగ, పెసర, ఉలవలు, బఠాణీ, పిల్లిపెసర, జనుము పచ్చిరొట్ట పంటలు.

నత్రజని

నత్రజని మొక్కల జీవిత కాలమంతా అవసరమే. మొక్క పెరుగుదలకు, దుగ్గు కట్టడానికి అవసరం. నత్రజనితో ప్రొటీన్ శాతం పెరుగుతుంది.

పచ్చి ఆకు ఎరువులు

పచ్చిరొట్ట వేసుకోవడం కుదరని పరిస్థితిలో దగ్గరలో ఉన్న చెట్ల ఆకులను, లేతకొమ్మలను తీసుకొని వచ్చి పొలంలో కలుపు కోవచ్చు. పచ్చిఆకు ఎరువుకు అనువైన పంటలు జిల్లేడు, సీతాఫలం, వెంపలి, తంగేడు, తగరంచ, బాడిశ తదితర మొక్కల ఆకులను పొలంలో వేసుకోవచ్చు. వరి పొలాల్లో వేసుకునేందుకు అనువైన పప్పు ధాన్యాలు–పెసర, అలసంద, శనగ, సోయాచిక్కుడు, వేరుశనగ, కంది వేసుకోవచ్చు.

వైభవంగా భరణి కృత్తిక వేడుకలు


గ్రామ వీధుల్లో విహరిస్తున్న వల్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామివారు


విజయపురం : శూలం వేషంలో భక్తుడు

కార్వేటినగరం: సంస్థానాధీశులు నిర్మించిన ప్రసిద్ధ స్కంధ పుష్కరిణి సమీపంలో కుమార గిరిపై వెలసి ఉన్న వల్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయంలో భరణి కృత్తిక వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సదర్భంగా వేకువ జామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పట్టువస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి భక్తులకు సర్వ దర్శన భాగ్యం కల్పించారు. ఈ క్రమంలో భాగంగా మొక్కులున్న భక్తులు కావళ్లతో వచ్చి స్కంధ పుష్కరిణిలో పవిత్ర స్నానమాచరించి, పసుపు బట్టలు ధరించి హరోంహర నామస్మరణతో స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. సాయంత్రం వల్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామివారు ప్రత్యేక వాహనంపై కొలువుదీరి, గ్రామ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. మొక్కులున్న భక్తులు స్వామివారికి ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈఓ కృష్ణనాయక్, ఎండోమెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యుత్ దీపాలు

ఆడికృత్తిక వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్కంధ పుష్కరిణి, స్వామివారి ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. కూడలి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్వామివారి భారీ కటౌట్లు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

ఘనంగా భరణి కావళ్లు

నింద్ర: మండలంలో ఆదివారం ఆడి కృత్తిక పురస్కరించుకుని మండలంలోని పలుగ్రామాల్లో భరణి కావళ్లతో తమిళనాడు తిరుత్తణి సుబ్రమణ్య స్వామి దేవాలయానికి బయల్దేరారు. పసుపు దుస్తులు ధరించి కావడితో గ్రామంలోని భక్తులు బయల్దేరారు. అదే విధంగా పిచ్చాటూరు సమీపంలో వున్న రామగిరి సుబ్రమణ్య స్వామి దేవాలయానికి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు.

విజయపురంలో...

విజయపురం: మండలంలో ఆడికృత్తిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం భక్తులు వివిధ వేషాలతో స్వామి సన్నిధికి చేరుకున్నారు. భక్తులు సూర్యోదయానికంటే ముందే నిద్ర లేచి శివుడు, పార్వతీ దేవి, వినాయకుడు, సుబ్రహ్మణ్య స్వామివార్ల చిత్రటానికి పూలమాలలు వేసి మొక్కులు తీర్చుకొన్నారు. అనంతరం భక్తిశ్రద్ధలతో కావడి మోసుకొని తిరుత్తణి బయల్దేరారు.

ఘనంగా ఆడికృత్తిక ఏర్పాట్లు


బస్టాండు ప్రాంగణంలో కావళ్ల విక్రయాలు

నగరి: ఆడికృత్తిక ఉత్సవాలను నియోజకవర్గ ప్రజలు ఎక్కువగా ఆచరిస్తారు. ఇక్కడ నివశించే శెంగుంద మొదలియార్ కులస్తుల్లో ఈ పండుగ ఎక్కువ ప్రాధాన్యతను సంతరించుకుంది. నగరి నుంచి కావళ్లతో వెళ్లే భక్తులు తిరుత్తణి కొండకు వెళ్లి మొక్కులు చెల్లించడం పరిపాటి. సోమవారం ఆడికృత్తిక కావడంతో ఆదివారం నుంచే భక్తులు పూజా సామగ్రి కొనుగోలు చేయడం ప్రారంభించారు. బజారు ప్రాంగణం జనంతో నిండింది. పండుగ రోజు కావడంతో పూజాసామగ్రి ధరలకు రెక్కలు వచ్చాయి. పువ్వులు ఎక్కువ ధర పలికాయి. బజారు ప్రాంగణంలో కావళ్లు, పసుపు దుస్తులు, పువ్వుల విక్రయాలు ఊపందుకున్నాయి.

పట్టణంలో వాహనాలకు అనుమతి నిలిపివేత

ఆడికృత్తికకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేస్తుండడంతో తిరుపతి నుంచి నగరి మీదుగా తిరుత్తణి చేరుకునే బస్సులు, ఇతర వాహనాలు, బైక్‌లు బైపాస్ వద్దే ఆపేస్తున్నారు. అక్కడి నుంచి ఆలయానికి నడిచి వెళ్లాల్సి ఉంది. అలాగే చిత్తూరు నుంచి తిరుత్తణికి చేరుకునే బస్సులను పీడబ్ల్యూడీ కార్యాలయం వద్ద ఆపేస్తున్నారు. అక్కడి నుంచి భక్తులు ఆలయానికి నడిచి వెళ్లాలి. కాగా తిరుత్తణిలో ఆడి భరణిని పురస్కరించుకొని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేక, దీపారాధనలు చేశారు. స్వామివారిని బంగారు కవచం, వజ్రాల హారం, ముత్యాలహారం, మరకత హారాలతో అలంకరించారు. ప్రత్యేక పుష్పార్చనలు చేశారు.

సిద్ధయ్య మృతి వైఎస్ఆర్ సీపీకి తీరని లోటు


సిద్ధయ్య మృత దేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి

కార్వేటినగరం: సీనియర్ నాయకుడు సిద్ధయ్య(75) మృతి వైఎస్ఆర్ సీపీకి తీరని లోటు అని మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గుండుగాని దళితవాడకు చెందిన సిద్ధయ్య మృతి చెందాడు. ఈ సమాచారం అందుకున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి గ్రామానికి వెళ్లి సిద్ధయ్య మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి సిద్ధయ్య ఎనలేని కృషి చేశాడని గుర్తు చేశారు. ఆయన వెంట వైఎస్ఆర్ సీపీ మండల అధ్యక్షుడు శేఖర్‌రాజు, సర్పంచ్ పవన్‌కుమార్, ఎంపీటీసీ దేశమ్మ, సీనియర్ నాయకుడు చందురాజు, శ్రీనివాసులు, ఆర్.సుబ్రమణ్యం మాజీ సర్పంచ్ దొరస్వామి తదితర నాయకులు ఉన్నారు.

నేడు ఆడికృత్తిక మహోత్సవం

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండ మల్లీశ్వర స్వామి ఆలయం ఆవరణలో ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో సోమవారం ఆడికృత్తిక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు, భక్తులకు అన్నప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

ముగిసిన పాలయాతమ్మ తిరునాళ్లు


పుష్పపల్లకిపై ఊరేగుతున్న అమ్మవారు

పాలసముద్రం: పాలయాతమ్మ వార్షిక తిరునాళ్లు ఆదివారం వైభవంగా ముగిశాయి. ఉదయం అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు దీపారాధనలు చేశారు. సాయంత్రం కాపు కట్టిన భక్తులు పూల గెరిగతో తొమ్మిది బావుల నీటిని తీసుకుని గ్రామాల్లో పంబ వాయిద్యాలతో ఊరేగించారు. అమ్మవారికి వేదపండితులు అభిషేకాలు చేశారు. కాపు కట్టిన భక్తులు అమ్మవారి ఎదుట అగ్నిగుండంలో అగ్ని తొక్కి మొక్కులు తీర్చుకున్నారు. పుష్పపల్లకిల్లో అమ్మవారిని సుందరంగా అలంకరించి, పురవీధుల్లో ఊరేగించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతి ఇచ్చి మొక్కుకున్నారు. యువకులు నృత్యాలు వేస్తు అమ్మవారిని ఊరేగించారు.


అగ్గితొక్కుతున్న భక్తులు

బాధిత కుటుంబాలకు ఓదార్పు

నరసింహులురెడ్డి మృతికి నివాళి


కాళికాపురం : నరసింహులురెడ్డికి నివాళులర్పిస్తున్న రాంప్రసాద్‌రెడ్డి

విజయపురం: కాళికాపురం పంచాయతీకి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ రమేష్ రెడ్డి తండ్రి నరసింహులురెడ్డి అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందాడు. ఆదివారం మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి, వైఎస్ఆర్ సీపీ నాయకులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను కలిసి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు పాండియన్, గౌతమ్, వినోద్‌కుమార్, ముత్తప్పరెడ్డి, ఉప సర్పంచ్ జి.రవి, యుగంధర్, కృష్ణమూర్తి, తదితరులు ఉన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ


నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి రోజా సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి

నింద్ర: మండలంలోని ఊరూరుపేట గ్రామంలో మృతి చెందిన టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రమేష్ చంద్ర ప్రసాద్ మృతదేహానికి ఆదివారం పలువురు నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి రోజా సోదరుడు రాంప్రసాద్ రెడ్డి, వైస్ ఎంపీపీ దుర్గాదేవి, పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా నగరి, పుత్తూరు, తిరుపతికి చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నేడు గంగమ్మ ఆలయంలో లీజు వేలం

తిరుపతి కల్చరల్ : తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు వివిధ పనుల లీజు కోసం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓ మమత తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ అమ్మవారికి భక్తులు సమర్పించే చీరలు, రవిక పీసులు సేకరణ లీజు హక్కు నిమిత్తం హిందూ దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో వేలం పాట ఉంటుందని పేర్కొన్నారు. 2024 జూలై 29 నుంచి 2025 జూలై 28వ తేదీ వరకు పనుల లీజు హక్కు ఉంటుందని వెల్లడించారు. వివరాలకు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మహాభారత ఉత్సవాలు ముగింపు


అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

వెదురుకుప్పం: పచ్చికాపల్లం గ్రామంలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో గత 10 రోజులుగా జరుగుతున్న మహాభారత ఉత్సవాలు ఆదివారం దుర్యోధన వధతో ముగిశాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి భాగవతారిణి భారతి హరికథ కాలక్షేపం నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం దుర్యోధన వధ ఘట్టాన్ని కళాకారులు రక్తికట్టించారు. ముందుగా గంగమడుగులో దాక్కొని ఉన్న దుర్యోధనుడిని భీమసేనుడు లాక్కొచ్చి చేసే యుద్ధ సన్నివేశం అలరించింది. కళాకారులు చేసిన నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. తదుపరి ధర్మరాజుల పట్టాభిషేకం జరిగింది. సాయంత్రం అమ్మవారి అగ్నిగుండ ప్రవేశాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు కంకణధారులై ఉపవాసాలతో అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకున్నారు. దుర్యోధన వధ కార్యక్రమానికి పచ్చికాపల్లం గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నేత బోడిరెడ్డి నరేష్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉత్సవాల సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ గుమ్మడి కుతూహలమ్మ కుమారుడు వైఎస్ఆర్ సీపీ నేత అనగంటి హరికృష్ణారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. నేతలు ఆయన్ను సాదరంగా స్వాగతించి ఘనంగా సత్కరించారు. వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్ రెడ్డి, యువత మండల అధ్యక్షుడు గణపతిరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆనంద్ సౌండ్స్ ఆధ్వర్యంలో విద్యుద్దీపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, రవికుమార్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, స్థానిక నేతలు భీమశంకర్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, జగదీశ్‌రెడ్డి, యువత, పెద్దలు, తోటివారు పాల్గొన్నారు.




యుద్ధానికి సిద్ధంగా ఉన్న భీమ, దుర్యోధనులు, ఉత్సవాల్లో పాల్గొన్న వైఎస్ఆర్ సీపీ నేత అనగంటి హరికృష్ణ, ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

భక్తిశ్రద్ధలతో కావళ్ల చెల్లింపులు


ఎట్టేరిలో స్వామి, అమ్మవార్లు, సిద్దేశ్వర స్వామి కొండపై భక్తుల రద్దీ

గంగాధర నెల్లూరు: మండలంలోని కోటగరం పంచాయతీ ఎట్టేరి వల్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో ఆడికృత్తిక మహోత్సవాల్లో మొదటి రోజు భరణి కావడి చెల్లింపులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ఉదయం అభిషేక పూజలు, 29న పాలాభిషేకం కావడి చెల్లింపులు ఉంటాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం 100 గొల్లపల్లి జైన్ ఫాం ఫ్రెష్ ఫ్యాక్టరీ, చిత్తూరు నగరానికి చెందిన ఓఎం రామదాసు దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. సోమవారం రాత్రి ద్రౌపది మాన సంరక్షణ వీధి నాటకం ఉంటుందని తెలిపారు. వింజం పంచాయతీ సిద్దేశ్వర స్వామి కొండ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆడికృత్తిక మహోత్సవం సందర్భంగా మొదటి రోజు భరణి కావడి చెల్లింపులకు భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారని ధర్మకర్త ఎ.నరసింహారెడ్డి తెలిపారు.

కోలాహలంగా భరణి కావళ్లు

పాలసముద్రం: మండంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం ఘనంగా భరణి కావళ్లు ఎత్తారు. సాయంత్రం పంబ వాయిద్యాలతో ప్రతి ఇంటి నుండి పసుపు రంగు దుస్తులతో కావళ్లను వరుస క్రమంతో నృత్యాలు వేస్తు ఉత్సాహంగా కావళ్లు ఎత్తారు. అనంతరం తిరుత్తణికి తరలివెళ్లారు. శ్రీకావేరిరాజుపురంలో పంబ వాయిద్యాలతో ఆటలు ఆడుతూ ఉత్సాహంగా కావళ్లను మోశారు.


పంబ వాయిద్యాలతో కావళ్లు తీసుకు వస్తున్న భక్తులు

ఆడికృత్తిక కావళ్ల సందడి


కావళ్లతో తిరుత్తణికి బయల్దేరిన భక్తులు

పుత్తూరు: శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆడికృత్తికను పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఉదయం గణపతి పూజ చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించి, పట్టు పీతాంబరాలు, విశేష సర్వాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పలు గ్రామాల నుంచి ముందస్తుగా చేపట్టిన కావళ్లతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి మొక్కులు తీర్చుకొన్నారు. తమిళనాడులోని తిరుత్తణిలో వెలసి ఉండు శ్రీసుబ్రమణ్యేశ్వర స్వామికి కావళ్లు సమర్పించుకోవడానికి గ్రామాలకు గ్రామాలు తరలి వెళ్లాయి. తొరూరు, తడుకు, కేఎంఅగ్రహారం, పరమేశ్వర మంగళం గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కావళ్లతో తిరుత్తణికి వెళ్లారు. దీంతో ఆదివారం నుంచే పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది.

ఐఎఫ్‌టీయూలో భారీగా చేరికలు


ఐఎఫ్‌టీయూలో చేరిన కార్మిక సంఘాల నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ)లో ఆదివారం పలు సంఘాల నేతలు చేరారు. ముఖ్యంగా సుమారు 40 ఏళ్లుగా జిల్లా కమ్యూనిస్టు పార్టీలో పనిచేసిన చైతన్య సైతం ఐఎఫ్‌టీయూలో చేరారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో జరిగిన చేరిక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి పెద్దగా ఒరిగిందేమీ లేదన్నారు. ఉద్యోగ, కార్మికులకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదని తెలిపారు. పలు ఫ్యాక్టరీల్లో కార్మిక చట్టాలు అమలు కావడం లేదన్నారు. పోరాటాలతో హక్కుల సాధనకు కృషి చేస్తామని చెప్పారు. ఐఎఫ్‌టీయూలో చేరిన వారిలో గుడిపాలలోని ఫుడ్ బేవరేజెస్ కార్మిక యూనియన్ అధ్యక్షుడు అన్బు, కార్యదర్శి వెంకటేష్ కోశాధికారి రమేష్, ఐఓసీ ట్యాంకర్స్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు అన్సర్, చిత్తూరు రూరల్ మండలంలోని గ్రావిటా ఇండియా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి దినేష్, ఉపాధ్యక్షులు మైఖేల్, నవీన్, సహాయ కార్యదర్శి ప్రశాంత్, సప్తగిరి గ్రామీణ బ్యాంకు క్యాజువల్ స్వీపర్స్ యూనియన్ అధ్యక్షుడు కిరణ్, ప్రధాన కార్యదర్శి రాజేష్, కోశాధికారి రాము, మధ్యాహ్నం భోజనం కార్మిక యూనియన్ అధ్యక్షులు రూబీ సెల్వి, బుజ్జి, చింతపండు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి, మున్నాతో పాటు దాదాపు 50 మంది ఉన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపునేని హరికృష్ణ వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.